

సాక్షి
గుంటూరు
సోమవారం । 23 । జనవరి । 2023



పులిచింతలలో నీటినిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.0610 టీఎంసీలు. ఎగువ నుంచి 1,200 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 2,216 క్యూసెక్కులు విడుదల చేశారు. పలు కాలువలకు 1895 క్యూసెక్కులు వదిలారు.



ఉత్సాహంగా సాక్షి స్పెల్ బీ

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ బీ సెమీ ఫైనల్ పరీక్ష విజయవాడ నగరంలోని నలందా విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. -8లో

న్యూస్‌రీల్

గుడ్ సమరిటన్ పోస్టర్ల ఆవిష్కరణ



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): రోడ్డు ప్రమాదం జరిగిన గంట (గోల్డెన్ అవర్)లోపు బాధితులకు సరైన వైద్య చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడే వారికి ప్రభుత్వం తరఫున రూ.5వేల బహుమతిని కలెక్టర్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు. ఈ నెల 18 నుంచి 24 వరకు జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా ఆదివారం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో గుడ్ సమరిటన్ పోస్టర్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.ప్రభావతితో కలిసి కరీం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను ఆస్పత్రుల్లో చేర్చి వారి ప్రాణాలను కాపాడాలని కోరారు. అనంతరం నగరంలోని పలు సిటీ బస్సులకు, పలు ప్రైవేట్ ఆస్పత్రుల వద్ద గుడ్ సమరిటన్ పోస్టర్లను అంటించారు. కార్యక్రమంలో డాక్టర్ కోగంటి కల్యాణ్ చక్రవర్తి, డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్యారమ్స్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



గుంటూరు వెస్ట్(క్రీడలు): ఈ నెల 20, 21 తేదీల్లో విజయవాడలో జరిగిన అంతర్ జిల్లాల జూనియర్, యూత్ క్యారమ్స్ పోటీల్లో గుంటూరుకు చెందిన క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో పతకాలు కైవసం చేసుకున్నారని జిల్లా క్యారమ్స్ సంఘం కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.నవ్య బంగారు, బి.శ్రీరమ్య కాంస్యం, జి.మయూక రజతం, ఎం.రాజ్ కుమార్ కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. దీంతోపాటు మిగతా క్రీడాకారులు చక్కని ప్రదర్శనతో గుంటూరు జిల్లాకు మంచి పేరు రావడంలో సహకరించారన్నారు. పతకాలు సాధించిన అందరూ ఈ నెల 31న మహారాష్ట్రలోని దాదర్లో జరగనున్న 47వ జాతీయ జూనియర్ క్యారమ్స్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారని పేర్కొన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా క్యారమ్స్ సంఘం అధ్యక్షులు ఎంకేవీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కుర్రా శ్రీనివాసరావు, సెలెక్షన్ కమిటీ చైర్మన్ పాలమణి శ్రీనివాసరావు అభినందించారని వివరించారు.

నేడు ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అవసరమైన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో సీనియర్ ఎస్జీటీలను నెలకు రూ.2,500 అలవెన్సుపై నియమించేందుకు సోమవారం ఉదయం 11.30 గంటలకు గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గణితం, బయాలాజికల్ సైన్స్, ఇంగ్లిష్, సోషల్ స్టడీస్ పోస్టుల్లో పని చేసేందుకు 30 శాతం డీఎస్సీ కోటా ఖాళీలనూ కలుపుకుని డీఈఓజీఎస్టీ.బ్లాగ్‌స్పాట్.కామ్‌లో ఉంచిన సీనియార్టీ జాబితాలో ఉన్న ఎస్జీటీలు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని డీఈఓ సూచించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 571.70 అడుగుల వద్ద ఉంది. ఇది 260.8379 టీఎంసీలకు సమానం. కుడికాలువకు 10,500, ఎడమకాలువకు 8,193, ఎస్ఎల్‌బీసీకి 2,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లోగా 21,093 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి 21,093 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 844.10 అడుగుల వద్ద ఉంది. ఇది 68.4175 టీఎంసీలకు సమానం.



గుంటూరు ఏసీ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద ఐజీ త్రివిక్రమవర్మ, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ పర్యవేక్షణ



నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



బాపట్లలోని పరీక్ష కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్ష

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఆదివారం కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 79 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 50,571 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 45,350 మంది హాజరయ్యారు. 5,221 మంది గైర్హాజరయ్యారు. ఐజీ త్రివిక్రమవర్మ, గుంటూరు ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ కొన్ని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



గుంటూరులో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం



గుంటూరులో అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న పోలీసు అధికారులు

రైతు శ్రేయస్సే లక్ష్యంగా సీఎం కృషి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, చిత్రంలో ప్రమాణం చేస్తున్న సభ్యులు

చిలకలూరిపేట: చంద్రబాబునాయుడు తన పరిపాలన కాలంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా కనికరం చూపలేదని.. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాత శ్రేయస్సే లక్ష్యంగా ప్రతిక్షణం పరితపిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ చంద్రబాబునాయుడు హయాంలో రైతులకు చేసింది శూన్యమని, అప్పట్లో వర్షాలు కురవక పంటలు ఎండిపోయి రైతులు నష్టాల పాలైనా పట్టించుకోకుండా, వారికి నష్టపరిహారమూ చెల్లించలేదని ఆరోపించారు. పంటల బీమా కూడా అన్నదాతలే చెల్లించుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు అప్పట్లో ఉండేవని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతలకు సున్నా వడ్డీ రుణాలను బ్యాంకులు ఇచ్చేవి కావన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేకపోయినా చంద్రబాబునాయుడు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకోకపోవటంతో జగనన్న ప్రభుత్వం వచ్చాక వారి కుటుంబాలకు నష్టపరిహారం అందజేశామని రజిని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు మేలు చేసేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నారని, ఇందులో భాగంగా ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.13,500 అందజేస్తున్నారని చెప్పారు.

నిరంతరాయంగా 9 గంటల విద్యుత్

అన్నదాతలకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా 9 గంటలు అందిస్తున్న గొప్ప ప్రభుత్వం తమదని రజిని చెప్పారు. గ్రామగ్రామాన రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అన్నదాతలకు ప్రభుత్వ ఫలాలు అత్యంత సులువుగా అందేలా సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారని వెల్లడించారు. రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర లభించేలా జగనన్న తీసుకుంటున్న చర్యలు ఈ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని.. ప్రతి పంటకు మన రాష్ట్రంలో ఇప్పుడు రికార్డు స్థాయిలో ధరలు లభిస్తున్నాయని చెప్పారు. ఏదైనా విపత్తు వల్ల పంట నష్టపోతే బాధిత రైతులకు వెను వెంటనే నష్ట పరిహారం అందిస్తున్న గొప్ప ముఖ్యమంత్రి జగనన్న అని కొనియాడారు. అన్నదాతలకు సున్నా వడ్డీ రుణాలు ఏటా ఠంఛనుగా అందిస్తున్న ప్రభుత్వం మనదని తెలిపారు. రైతులకు పంటల బీమా కూడా ఏటా క్రమం తప్పకుండా చెల్లిస్తున్న మనసున్న ముఖ్యమంత్రి జగనన్న అని కొనియాడారు. అన్నదాత ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా బీమా మొత్తాన్ని చెల్లిస్తున్న ప్రభుత్వం ఈ దేశంలోనే మన రాష్ట్రంలో మాత్రమే ఉందన్నారు. రైతుల కోసం ఇంత మేలు చేస్తున్న ప్రభుత్వం గొప్పతనాన్ని పాలక మండలి సభ్యులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కమిటీ కొత్త చైర్మన్‌గా తోట రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్‌గా మానుకొండ శ్రీనివాస వీరారెడ్డి, పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు శరవేగంగా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మాఘ పౌర్ణమి సందర్భంగా ఫిబ్రవరి 5వ తేదీన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవస్థాన ప్రచార రథంపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామిని ఊరేగింపుగా ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ నిర్వహిస్తారు. దీనికి అవసరమైన అన్ని అనుమతులు రావడంతో పాటు నిర్వహణపై ఆలయ ఈవో భ్రమరాంబ వైదిక కమిటీతో సమావేశమయ్యారు. మాఘమాసం పౌర్ణమి నుంచి ప్రారంభించే గిరి ప్రదక్షిణ ఇకపై ప్రతి నెలా పౌర్ణమి రోజున ఉదయం 6 గంటలకు ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ, భక్తుల కోలాట నృత్యాల మధ్య నిర్వహించే గిరి ప్రదక్షిణ దేవస్థాన మహా మండపం నుంచి ప్రారంభమై కనకదుర్గనగర్, కుమ్మరిపాలెం, విద్యాధరపురం, సితారా, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కేటీరోడ్డు మీదుగా బ్రాహ్మణ వీధి చేరుకుంటుంది. బ్రాహ్మణ వీధి నుంచి నేరుగా ప్రచార రథం ఆలయానికి చేరుకునేలా రూట్ మాప్ సిద్ధం చేశారు. గిరి ప్రదక్షిణలో ఆలయానికి చెందిన ముఖ్య అధికారులతో పాటు సిబ్బంది, అర్చకులు, వేద పండితులు, వారి కుటుంబ సభ్యులందరూ పాల్గొనే అవకాశం ఉంది.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

రద్దీ సాధారణం

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకే క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ కొనసాగింది. మహా నివేదన అనంతరం ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి విగ్రహం వద్ద భక్తులు క్యూలైన్లు బారులు తీరి కనిపించారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమంతో పాటు సాయంత్రం నిర్వహించిన పంచహారతుల సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు. సాయంత్రం నుంచి రద్దీ ఓ మోస్తరుగా ఉంది.

తిరుపతమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు దినంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి రావటంతో గ్రామంలో ట్రాఫిక్ అవరోధాలు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అక్షరాయుధం

- చక్కని చేతిరాతకు బాటలు వేస్తున్న గురువులు
- ఆణిముత్యాల్లా రాసేలా శిక్షణ
- నేడు ప్రపంచ చేతిరాత దినోత్సవం

యడ్లపాడు: చక్కని చేతిరాత ఒక కళ. రాతను బట్టి మనిషి వ్యక్తిత్వం, గుణగణాలు చెప్పవచ్చంటారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించాలన్నా.. చేతిరాత పాశుపతాస్త్రమన్నది జగమెరిగిన సత్యం. అందుకే ప్రాథమిక దశ నుంచే విద్యార్థుల చేతిరాతపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపుతుంటారు. కొందరు గురువులు విద్యార్థుల చేతిరాతను అందంగా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తుంటారు. అలాంటి ఇద్దరు గురువుల గురించి నేడు ప్రపంచ చేతిరాత దినోత్సవం సందర్భంగా తెలుసుకుందాం..

'రామ'సక్కని రాత



యడ్లపాడు మండలం జగ్గాపురం జెడ్పీ హైస్కూల్లోని లెక్కల మాస్టారు రామమోహనరావు తన తండ్రి జ్ఞాపకార్థంగా విద్యార్థులకు నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసేవారు. ఈయన సహోపాధ్యాయులు కొందరితో కలిసి క్యాలిగ్రఫీ(చేతిరాత)లో కొంతకాలం శిక్షణ తీసుకున్నారు. ఈనైపుణ్యాన్ని తన విద్యార్థులకూ నేర్పించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు రామమోహనరావును ప్రశంసలతో ముంచెత్తారు. ఫలితంగా చేతిరాతలో లక్షమందికి శిక్షణ ఇవ్వాలని ఆయన నిర్ణయించుకున్నారు. పలు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. లక్ష్య సాధన దిశగా ముందుకు సాగుతున్నారు.

'జున్ను' ముక్కల్లాంటి అక్షరాలు



సొలస ఏపీ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న షేక్ జున్ను సాహెబ్ బహుముఖ ప్రజ్ఞాశాలి. లిమ్రా హ్యాండ్‌రైటింగ్ ఇనిస్టిట్యూట్ కరిముల్లా వద్ద క్యాలిగ్రఫీలో ఈయన శిక్షణ పొందారు. హ్యాండ్‌రైటింగ్ రకాలు, పేపర్ ఫోల్డింగ్ (ఒరిగామి) విభాగాల్లో నైపుణ్యం సాధించారు. ఈయన ఇంగ్లిష్ మాత్రమే కాకుండా తెలుగు, హిందీ అక్షరాలనూ అందంగా రాయడంలో దిట్ట. క్యాలిగ్రఫీ గ్రాఫిక్ డిజైన్ రెండేళ్ల డిప్లొమా కోర్సులోనూ శిక్షణ పొందుతున్నారు. గతేడాది డిసెంబర్ ప్రథమంలో ఫస్టియర్ పరీక్షలను రాశారు. తన పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు, వివిధ కార్యాలయ ఉద్యోగులు, అనాథాశ్రమాల్లో చదివే విద్యార్థులకు చేతరాతలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణ ఇలా..

రామమోహన్‌రావు, జున్ను మాస్టార్లు చేతిరాతపై శిక్షణ ఇచ్చేందుకు మరో 23 మందితో కలిసి క్యాలిగ్రఫీ ఫ్యామిలీ, క్యాలీగ్రఫీ ఫ్రెండ్స్ అనే రెండు వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశారు. వీరు ఏ పాఠశాలకు వెళ్లినా అక్కడి ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ ఇచ్చి నాలుగు రూళ్ల రాత పుస్తకాలను ఉచితంగా అందిస్తారు. టీచర్లందరినీ తమ గ్రూపులో యాడ్ చేసుకుని వారి ద్వారా విద్యార్థులకు వరుసగా వారం రోజులు శిక్షణ ఇచ్చేలా పర్యవేక్షిస్తారు. చివరి రోజున నేర్చుకున్న దానిపై పరీక్షలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతుల్ని అందజేస్తారు.

లక్ష మందికి శిక్షణ ఇవ్వాలనేది లక్ష్యం

లక్ష మందికి దస్తూరీపై శిక్షణ ఇవ్వాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని పలు పాఠశాలల్లో 825 మంది టీచర్లకు, 20,400 మంది విద్యార్థులకు క్యాలిగ్రఫీలో శిక్షణ ఇచ్చా. ఈ బృహత్తర ప్రయాణం నిరంతరం కొనసాగిస్తా. ఇందుకు నాకు అన్ని విధాలా సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

– వి.రామమోహనరావు, టీచర్ జగ్గాపురం జెడ్పీహైస్కూల్

రాయడం ఓ కళ

రాయడం మంచి కళ. విద్యలో అన్ని విధాలా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. అందమైన చేతిరాతను నేర్చుకుంటే అక్షరాలు ఆయుధంలా మారతాయి. తద్వారా ఆత్మస్థైర్యం పెరుగుతుంది. క్యాలిగ్రఫీ నేర్చుకునేలా పిల్లల్ని తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. విద్యార్థులు పాఠ్యాంశాలను చదవడంతోపాటు ఎక్కువగా రాయడం అలవాటు చేసుకుంటే చేతిరాతలో మరింత నైపుణ్యం పెరుగుతుంది.

– షేక్ జున్నుసాహెబ్, సొలస ఏపీ పాఠశాల టీచర్

ఏడుగురు ఉపాధ్యాయులపై చర్యలు



ఈనెల ఏడున ఆందోళన చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు (ఫైల్)

- ఐదుగురి సస్పెన్షన్
- ఇద్దరికి స్థానచలనం
- తెనాలి ఎన్ఎస్ఎస్ఎంహెచ్ స్కూల్లో ఘటన
- ఆరోపణలు లేనివారిని సస్పెండ్ చేయడంపై విస్మయం

తెనాలిఅర్బన్: స్థానిక అయితానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య, సరస్వతి మున్సిపల్ (ఎన్ఎస్ఎస్ఎంహెచ్) హైస్కూల్‌లో ఏడుగురు ఉపాధ్యాయులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవడం కలకలం రేపింది. వీరిలో ఐదుగురు ఉపాధ్యాయులను విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఇద్దరిని బదిలీ చేశారు. తెనాలి డెప్యూటీ డీఈఓ నిర్మల కథనం ప్రకారం ఎన్ఎస్ఎస్ఎంహెచ్ స్కూల్‌లో హిందీ టీచర్‌గా నీలిమా ప్రశాంతి, క్రాఫ్ట్ టీచర్‌గా విజయలక్ష్మి పనిచేస్తున్నారు. విజయలక్ష్మి విధులలో అలసత్వంగా ఉంటుందని, ఎన్నిసార్లు హెచ్చరించినా ఆమెలో మార్పు రావడం లేదని ఆరోపిస్తూ వైఎస్సార్ సీపీ ఒకటో వార్డు కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర నేతృత్వంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ నెల 7న పాఠశాల ముందు ఆందోళన చేశారు. ఆమెకు సహకరిస్తున్న హిందీ టీచర్ నీలిమా ప్రశాంతితోపాటు విజయలక్ష్మిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అదే రోజు ప్రభుత్వం విద్యార్థులకు సమ్మెటివ్ పరీక్షలను నిర్వహించింది. వాటికి విద్యార్థులు గైర్హాజరై ఆందోళనలో పాల్గొన్నారు. డీఈఓ శైలజ తెనాలి వచ్చి తమతో చర్చించాలని, లేకుంటే ఆందోళన విరమించేది లేదని వారు భీష్మించడంతో ఆమె ఇక్కడకు వచ్చారు. సుమారు ఐదు గంటల పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులతో సుదీర్ఘంగా మాట్లాడారు. అలాగే వారి ఆరోపణలపై విచారణ జరిపారు. ఆ సమయంలో డీఈఓ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ఉపాధ్యాయులందరి మెడకు వ్యవహారం..

సమ్మెటివ్ పరీక్షలను నిర్వహించకుండా పరోక్షంగా ఆందోళనకారులకు సహకరించారనే నెపంతో పాఠశాలలో పనిచేస్తున్న ప్రసూన, సంపూర్ణ, నాగమ్మ, సోమశేఖర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు సమాచారం. అయితే ఉత్తర్వుల్లో మాత్రం విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారని డీఈఓ పేర్కొన్నారు. ఇదే పాఠశాలలో పనిచేస్తున్న కోటిరెడ్డి అనే ఉపాధ్యాయుడు నవంబర్ నుంచి ఎటువంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరయ్యారు. ఆయననూ సస్పెండ్ చేస్తున్నట్టు డీఈఓ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఆరోపణలు ఎదుర్కొన్న క్రాఫ్ట్ టీచర్ విజయలక్ష్మిని జిల్లా పరిషత్ హైస్కూల్ కొలకలూరుకు, హిందీ టీచర్ నీలిమా ప్రశాంతిని మంగళగిరిలోని శ్రామికనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు బదిలీ చేశారు. అయితే ఆరోపణలు వచ్చిన ఇద్దరిని బదిలీ చేసి అసలు ఎటువంటి ఆరోపణలూ లేని నలుగురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు వేయడంపై విస్మయం వ్యక్తమవుతోంది. దీనిపై ఉన్నతాధికారులను కలిసి తమ గోడు వినిపిస్తామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. వేటు పడిన వారి స్థానంలో జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల నుంచి డెప్యూటేషన్‌పై టీచర్లను పంపేలా ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. కొత్త టీచర్లు రెండురోజుల్లో విధుల్లో చేరే అవకాశం ఉంది.

ప్రశాంతంగా కానిస్టేబుళ్ల రాత పరీక్ష

● 27,254 అభ్యర్థుల హాజరు ● పరీక్ష కేంద్రాల్ని తనిఖీ చేసిన గుంటూరు రేంజ్ ఐజీ త్రివిక్రమ వర్మ


పరీక్షకు హాజరైన యువతీ, యువకులు


అభ్యర్థుల సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

నగరంపాలెం: జిల్లావ్యాప్తంగా ఆదివారం పోలీస్ కానిస్టేబుళ్ల రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడంతో పోలీస్ శాఖ సఫలీకృతమైంది. దీంతో అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ముగిశాయి. జిల్లా అంతటా 45 పరీక్ష కేంద్రాల్ని ఏర్పాటు చేయగా, 30,916 మంది అభ్యర్థులకు గానూ 27,254 (88.1 శాతం) మంది హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమవ్వగా, ఉదయం 9 గంటల నుంచే సిబ్బంది అభ్యర్థుల్ని లోపలకు అనుమతించారు. దీంతో హడావుడి లేకుండా ప్రశాంతంగా లోనికెళ్లారు. ప్రతి కేంద్రం వద్ద అభ్యర్థుల్ని పోలీసు సిబ్బంది మెటల్ డిటెక్టివ్‌లతో తనిఖీ చేశారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువుల్ని ప్రత్యేక కౌంటర్లల్లో భద్రపరిచి, టోకెన్లను అందించారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కూలంకషంగా పరిశీలించారు. గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమవర్మ, జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ గుంటూరు నగరంలోని పలు పరీక్ష కేంద్రాల్ని పరిశీలించారు. పరీక్షలు ముగిసే వరకు అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా పటిష్టమైన బందోబస్తును కొనసాగించాలని ఎస్పీని గుంటూరు ఐజీ ఆదేశించారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ విడిగా జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాల్లో విస్తృతంగా పర్యటించారు. వీవీఐటీ, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల, కళ్లం హరినాథరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కలియ తిరిగారు. పోలీస్ సిబ్బందికి, కళాశాలల యాజమాన్యానికి పలు సూచనలు చేశారు. రూట్ మొబైల్, ఫ్లయింగ్ స్క్వాడ్, బ్లూ కోట్స్ బృందాలు సైతం విస్తృతంగా పర్యటించాయి. కేంద్రాల వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు 144 సెక్షన్ అమలు చేశారు. పరిసర ప్రాంతాల్లో జిరాక్స్, మొబైల్ దుకాణాల్ని మూసి వేయించారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

మేదరమెట్ల: బాదం కాయలు కోసుకునేందుకు వెళ్లిన ఆరో తరగతి విద్యార్థి విద్యుదాఘాతానికి గురై తిరిగిరాని లోకానికి వెళ్లిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. కొరిశపాడు మండలంలోని దైవాల రావూరు ఎస్సీ కాలనీకి చెందిన గడ్డం బుజ్జి కుమారుడు గడ్డం అఖిల్(12) స్నేహితుడు నూకతోటి జోబాబుతో కలసి గ్రామంలోని సాయిబాబా గుడి ప్రాంతంలో బాదం కాయలు కోసుకునేందుకు ఇద్దరు చెట్టు ఎక్కారు. చెట్టు ఆనుకొని ఉన్న హైటెన్షన్ వైర్లను గమనించలేదు. బాదం కాయలు కోసుకుంటున్న సమయంలో వైర్లు అఖిల్‌కు తగిలాయి దీంతో అఖిల్ చెట్టుపైనే మృతి చెందగా జోబాబుకు కూడా విద్యుదాఘాతానికి గురికావడంతో చెట్టుపై నుంచి కింద పడిపోయాడు. దీంతో సమీపంలో ఉన్న స్థానికులు గమనించి కింద పడిన బాలుడిని మేదరమెట్లలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కొరిశపాడు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వరరావు ప్రమాదం జరిగిన తీరును స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ఉత్సాహంగా సాక్షి స్పెల్ బీ





సెమీ ఫైనల్ రౌండ్‌లో హాజరైన 120 మంది విద్యార్థులు

విజయవాడ బెంజ్‌సర్కిల్ సమీపంలోని నలంద స్కూల్లో నిర్వహించిన సాక్షి స్పెల్ బీ పరీక్షకు హాజరైన విద్యార్థులు

SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP SAKSHI SPELL Bee

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఇంగ్లిష్‌పై విద్యార్థుల భయాన్ని తొలగించేందుకు సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ బీ సెమీ ఫైనల్ పరీక్ష విజయవాడ నగరంలోని నలందా విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యారుల్ని నాలుగు గ్రూపులుగా విభజించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి మొత్తం 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలకు మెయిన్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వాఫీ, రాజమండ్రిలోని ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అసోసియేషన్ స్పాన్సర్‌గా వ్యవహరించారు.

ఎలా పలకాలో అర్థమైంది



ఇంగ్లిషు పదాలను చదవడం, రాయడంతో పాటుగా ఎలా పలకాలో తెలిసింది. పదాలకు అర్థం తెలుసుకుంటున్నాను. స్పెల్ బీ పరీక్ష రాయడం వల్ల స్కూల్లో చెప్పే ఇంగ్లిష్ పాఠాలు ఆసక్తిగా వింటున్నాను. కొత్త పదాలను ఎలా పలకాలో టీచర్‌ను అడిగి తెలుసుకుంటున్నాను.

–ధరణి సింధూర–4వ తరగతి, ఎన్టీఆర్ జిల్లా.

ఇంగ్లిష్‌పై పట్టుకు దోహదం



ప్రస్తుత రోజుల్లో ఇంగ్లిష్ నేర్చుకోవడం చాలా అవసరం. చిన్నతనం నుంచే ఎలా చదవాలి, ఎలా పలకాలి, ఎలా రాయాలో తెలిస్తే ఎలా మాట్లాడాలనే విషయంపై అవగాహన వస్తుంది. ఇంగ్లిష్ భాషపై పట్టుకు స్పెల్ బీ పరీక్ష విద్యార్థులకు ఎంతగానో దోహదం చేస్తుంది.

–టి.రాధాకృష్ణారెడ్డి, ఉపాధ్యాయుడు, విద్యార్థి తండ్రి, నందిగామ

కొత్త పదాలు తెలుసుకున్నా



ఇంగ్లిష్‌ను ఇప్పటి వరకు ఒక ల్యాంగేజ్‌గానే చదివాను. అలా కాకుండా స్పెల్లింగ్స్‌ల సహా చదవాలని తెలిసింది. పదాలను ఎలా పలకాలో కూడా తెలిసింది. స్పెల్ బీ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న సమయంలో కొన్ని కొత్త పదాలు తెలుసుకున్నాను.

–హితేష్, 5వ తరగతి, గుంటూరు జిల్లా

ఇంగ్లిష్‌పై ఇష్టం పెరిగింది



ఇంగ్లిష్‌పై గతంలో కొంత భయం ఉండేది. సాక్షి స్పెల్ బీ పరీక్షలకు హాజరవుతుండటంతో భయం మెల్లగా తగ్గి ఇష్టం పెరిగింది. స్పెల్లింగ్స్‌తో సహా చదవాలనే విషయం తెలిసింది. కొత్త పదాలను తెలుసుకోవడమే కాకుండా వాటి అర్థాలు కూడా తెలిశాయి.

–ఎం.అక్షయ, 9వ తరగతి, ప్రకాశం జిల్లా

పిల్లలకు ఎంతో ఉపయోగం



ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగం. విద్యార్థి చదువుతున్న స్కూల్లో బాగా చదివినా ఇలాంటి పరీక్షల్లో పాల్గొనడం వల్ల వారిలో ఆ సబ్జెక్టుపై పట్టు ఎంత ఉందో బహిర్గతం అవుతుంది. విద్యార్థిలో పోటీ తత్వం పెరుగుతోంది.

– కె.సుకుమార్, విద్యార్థి తండ్రి, విజయవాడ.

ఎలా చదవాలో తెలుస్తుంది



ఇంగ్లిష్ భాషపై పట్టు ఏ స్థాయిలో ఉందో ఇలాంటి పరీక్షల్లో పాల్గొనడం వల్ల తెలుస్తుంది. ఏ స్థాయిలో పిల్లలు ఉన్నారో తెలిస్తే వారిపై మరింత శ్రద్ధ పెట్టి చదివించవచ్చు. మిగిలిన సబ్జెక్టులు చదివినట్లుగా ఇంగ్లిష్‌ను చదవకూడదనే విషయం పిల్లలకు తెలుస్తుంది.

–సీహెచ్. సుజన, విద్యార్థి తల్లి విజయవాడ

త్వరలో జంతర్ మంతర్ వద్ద చేనేతల ధర్నా

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం 2023-24 వార్షిక బడ్జెట్‌లో చేనేతల రంగానికి కనీసం రూ.10వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చేనేతలతో త్వరలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు సామాజిక న్యాయ కేంద్రం రాష్ట్ర కన్వీనర్ వై. కోటేశ్వరరావు(వైకే) తెలియజేశారు. ఆదివారం గుజ్జనగుండ్లలో చేనేత కార్మిక సంఘాల ప్రతినిధుల, శ్రేయోభిలాషుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేతల డిమాండ్ల సాధనకు అనంతపురం, నెల్లూరు, రాజమండ్రి, విశాఖపట్నాలలో ప్రాంతీయ రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసి చివరిలో విజయవాడలో చేనేతల సమీకరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు.

వాహనం ఢీకొని యాచకురాలి మృతి

మేదరమెట్ల: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యాచకురాలు దుర్మరణం చెందిన ఘటన జాతీయ రహదారి కొండ సమీపంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. అద్దంకి ఎన్టీఆర్ కాలనీ నాలుగో లైనులో నివాసం ఉంటున్న అల్లం జయమ్మ(45) భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. మేదరమెట్ల కొండ సమీపంలోని ఓ దాబా వైపు నుంచి రోడ్డు దాటుతుండగా ఒంగోలు వైపు నుంచి వచ్చిన కారు జయమ్మను ఢీ కొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కాగా హైవే అంబులెన్సులో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించే క్రమంలో మార్గంమధ్యలో మృతి చెందింది. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు కోసం గాలిస్తున్నట్లు మేదరమెట్ల ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభం

ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి, బొల్లా


మొదటి ఎడ్ల జతను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బండలాగుడు బలప్రదర్శన పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రైతు సంబరాల్లో భాగంగా గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మెమోరియల్‌పై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో నిర్వహిస్తున్న పోటీల ప్రారంభోత్సవానికి జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, వినుకొండ శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రారంభానికి చిహ్నంగా శాంతికపోతాలను ఎగురవేశారు. మొదటి రోజు పాలపళ్ల విభాగ ఎడ్ల జతల యజమానుల్ని అభినందిస్తూ పందేలను ప్రారంభించారు. తొలుత పోటీల సందర్భంగా స్టేడియం ఆవరణలో ఏర్పాటుచేసిన వ్యవసాయ, ఉద్యాన శాఖల స్టాళ్లతో పాటు రోడ్డు సేఫ్టీ విభాగం, వ్యవసాయానికి వినియోగించే వివిధ కంపెనీల పురుగుమందుల స్టాళ్లను ప్రారంభించి, వారు ఏర్పాటుచేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ముఖ్య అతిథులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(పౌడా) చైర్మన్ మిట్టపల్లి రమేష్, నిర్వాహకులు దుశ్శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి పోటీల్ని నిర్వహిస్తున్నామన్నారు. పోటీలు ఎనిమిది విభాగాల్లో ఎనిమిది రోజుల పాటు జరుగుతాయని చెప్పారు. మొదటిరోజు పాలపళ్ల విభాగంలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 28జతలు హాజరయ్యాయి. పోటీలు పొద్దుపోయేంతవరకు జరిగే అవకాశం ఉంది. పోటీల్ని తిలకించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంతో వేలాదిమంది హాజరై కేరింతలు కొడుతూ ఎడ్లను ఉత్సాహపర్చారు. పందేల్ని నిర్వాహక కమిటీ సభ్యులు చల్లా నారపరెడ్డి, మూరే రవీంద్రరెడ్డి, గాడిపర్తి సీతయ్య, కనకా పుల్లారెడ్డి, లక్కు కృష్ణారెడ్డి, వంపుగుడి జాన్, పొలిమేర వెంకటరెడ్డి పర్యవేక్షిస్తుండగా, శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి రిఫరీలుగాను, సూరపనేని రాధాకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

సూసైడ్ లెటర్ రాసి యువకుడు అదృశ్యం

కారెంపూడి: సూసైడ్ లెటర్ రాసి పెట్టి ఇంటినుంచి యువకుడు అదృశ్యమైన ఘటన కారెంపూడిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన 24 ఏళ్ల బొక్కా పాపారావు బీటెక్ వరకు చదువుకున్నాడు. ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ ఇంటికి రాలేదు. అతను రాసిని సూసైడ్ లెటర్ లభ్యమైంది. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, బంధువులంతా గ్రామం పక్కనే ఉన్న సాగర్ కుడి కాల్వ వెంట వెతుకుతుండగా వినుకొండ రోడ్డు బ్రిడ్జి ఆక్విడెట్ సమీపంలో కాల్వ కట్టపై అతని చెప్పులు కన్పించడంతో కాల్వలో గాలిస్తున్నారు. సూసైడ్ లెటర్‌లో.. 'అమ్మా నన్ను క్షమించు వెళ్లిపోతున్నా పైకి, ఇంటికి పెద్ద కొడుకుగా బాధ్యతగా ఉండలేకపోయా, మిమ్మల్ని నమ్మించి మోసం చేశా, తమ్ముడిని, నిన్ను నరకంలో వదిలేసి వెళ్తున్నా, నేను లవ్‌లో ఫెయిల్ అయినప్పుడు నన్ను మీరు మనిషిని చేశారు. ఇప్పుడు నేను వ్యసనానికి బానిసయ్యాను'. అమ్మను తమ్ముడిని జాగ్రత్తగా చూసుకోవాలని బంధువులను వేడుకుంటూ ఇంకా అనేక విషయాలను పేర్కొన్నాడు. ఇదిలా ఉంటే పాపారావు ఆన్‌లైన్ బెట్టింగులకు బానిసైనట్లు తెలుస్తోంది. రూ.లక్షల్లో వివిధ వ్యక్తుల వద్ద అప్పులు చేసినట్లు సమాచారం.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు కుసుమకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏ.ఎస్. కుసుమకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. పాత పెన్షన్ కాకుండా జీపీఎస్ సహా ఇతర స్కీంలను అంగీకరించేది లేదని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిల్ని చెల్లించాలని, ప్రస్తుతం ఇవ్వాల్సిన మూడింటిని ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ చిన్న కారణాలతో ఉపాధ్యాయుల్ని సస్పెండ్ చేయడం భావ్యం కాదని తెలిపారు. ముందుగా షోకాజ్ నోటీసు ఇవ్వకుండా ఒక్కసారిగా సస్పెండ్ చేస్తుండటంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు పి.వి. శ్రీనివాసరావు, జిల్లా సహాధ్యక్షురాలు ఏ.ఎల్. శివపార్వతి, కోశాధికారి ఎండీ. గయాసుద్దౌలా, సీపీఎస్ కన్వీనర్ సీహెచ్. ఆదినారాయణ, ఎండీ. షకీలా బేగం, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమ్మకం, ధైర్యం లేనివాడు రాజకీయాలకు పనికిరాడు

- జోడీగా వచ్చినా రాజకీయ మరణం తప్పదు
- వైఎస్సార్ సీపీ పరిపుష్టి కోసమే సచివాలయ కన్వీనర్ల వ్యవస్థ
- ఆంధ్రప్రదేశ్‌లో ముందస్తు ఎన్నికలకు అవకాశం లేదు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు


మంత్రి అంబటి రాంబాబును సత్కరిస్తున్న మిట్టపల్లి రమేష్, నాయకులు

సత్తెనపల్లి: ఎన్నికల్లో ఘోర ఓటమి తప్పించుకునేందుకు ఒంటరిగా కాకుండా జోడిగా వస్తున్నారని.. అయినా వారికి రాజకీయ మరణం తప్పదని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను ఉద్దేశించి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి సచివాలయాల కన్వీనర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గెలుపుపై ధైర్యం, నమ్మకం లేనివాడు రాజకీయాలకు పనికిరాడన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆత్మస్థైర్యంతో పోరాడి ప్రజల అభిమానంతో ముఖ్యమంత్రి పదవిని సాధించారని గుర్తుచేశారు. ముందస్తు ఎన్నికల అంటూ కొంతమంది ప్రచారం చేస్తున్నారని ఇది అవాస్తవమని, ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్ ప్రకారమే వస్తాయన్నారు. అయితే ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు, పార్టీ పరిపుష్టికి గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారన్నారు. కన్వీనర్లు వలంటీర్లపై పెత్తనం చేయకుండా గృహ సారథులతో కలిసి పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అందేలా చూడాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాలపై అత్యధిక మంది ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రత్యక్షంగా గమనిస్తున్నానని అంబటి వివరించారు.

కన్వీనర్లదే క్రియాశీలక పాత్ర...

రానున్న కాలంలో కన్వీనర్లు, గృహసారథులే క్రియాశీలక పాత్ర పోషిస్తారని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ప్రభుత్వపరంగా అందుతున్న లబ్ధిని ప్రతి ఇంటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కన్వీనర్లు, గృహసారథులు సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. బాధ్యతగా పనిచేసి పార్టీకి మంచి పేరు తీసుకు రావాలన్నారు. అందరూ కష్టపడి పని చేస్తే తప్పకుండా 175 స్థానాల్లోనూ విజయం సాధిస్తామన్నారు. కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు ప్రభుత్వం అందిస్తుందని కొనియాడారు. ప్రభుత్వ పథకాలు పార్టీలకతీతంగా అందుతున్నాయని, గత పాలన కంటే అన్ని విధాల వైఎస్సార్ సీపీ పరిపాలన బాగుందని గుర్తుచేశారు.

సీఎం జగన్ మాట ఇస్తే తప్పడు

పల్నాడు జిల్లా అభివృద్ధి కమిటీ(పౌడా) చైర్మన్ మిట్టపల్లి రమేష్ మంత్రి అంబటి రాంబాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. మంత్రి అంబటి రాంబాబు మిట్టపల్లి రమేష్‌ను అభినందించారు. పల్నాడు జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మిట్టపల్లి రమేష్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే తప్పడని అందుకు తానే నిదర్శనమన్నారు. మొట్టమొదటి పౌడా చైర్మన్‌గా అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, పార్టీ సత్తెనపల్లి రూరల్ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, నకరికల్లు మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, ఏంజీఆర్ లింగారెడ్డి, శిరిగిరి గోపాలరావు, నక్కా శ్రీను, బాసు లింగారెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, అచ్యుత శివప్రసాద్, షేక్ యలవర్తిపాటి ఈసా, తేలుకుట్ల చంద్రమౌళి, సహారా మౌలాలి, గృహసారథుల కన్వీనర్లు కొణతం స్వాతి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, చిలుకా జయపాల్, పులిబండ్ల అశోక్, మేడం ప్రవీణ్‌రెడ్డి, పెండెం బాబూరావు, జొన్నలగడ్డ ఆనంద్ పాల్గొన్నారు.